సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

PRGI - TGTEL/25/A0348
జాతీయ తెలుగు దినపత్రిక
Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు




శుక్రవారం 03 జూలై 2026 | ● పేజీలు : 08 | ● వెల: 2/- | ● సంపుటి: 2 . సంచిక : 31 | ● ప్రచురణ : సూర్యాపేట | ● ఎడిటర్: శెట్టి వెంకటేష్



## భారత్‌కు జపాన్ ప్రధాని సనాయే టకైచికి ఘన స్వాగతం

న్యూఢిల్లీ, జూలై 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): భారత్–జపాన్ ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో జపాన్ ప్రధానమంత్రి సనాయే టకైచి భారత పర్యటనకు విచ్చేయనున్న నేపథ్యంలో దేశ రాజధాని న్యూఢిల్లీలో ఘన స్వాగత ఏర్పాట్లు పూర్తయ్యాయి. భారత ప్రభుత్వం ఆమెకు అత్యున్నత స్థాయి ప్రోటోకాల్‌తో స్వాగతం పలకనుంది. ఈ పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో టకైచి ద్వైపాక్షిక చర్చలు జరపనుండగా, రక్షణ, వాణిజ్యం, పెట్టుబడులు, అత్యాధునిక సాంకేతికత, సెమీకండక్టర్లు, మౌలిక సదుపాయాలు, హరిత ఇంధనం, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో వ్యూహాత్మక సహకారం తదితర కీలక అంశాలపై ఒప్పందాలు కుదిరే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి. భారత్–జపాన్ ప్రత్యేక వ్యూహాత్మక మరియు గ్లోబల్ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశ్యంగా భావిస్తున్నారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక, పారిశ్రామిక, సాంకేతిక రంగాల్లో సహకారం మరింత విస్తరించేందుకు ఈ సమావేశం కీలకంగా మారనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ పర్యటనతో ఆసియా ప్రాంతంలో శాంతి, భద్రత, పరస్పర అభివృద్ధికి కొత్త దిశ లభించే అవకాశముందని దౌత్యవర్గాలు పేర్కొంటున్నాయి.

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన సీఎస్ సంజయ్ జాజు



హైదరాబాద్, జూలై 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (చీఫ్ సెక్రటరీ) సంజయ్ జాజు శుక్రవారం మధ్యాహ్నం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలి మర్యాదపూర్వక భేటీలో భాగంగా డిప్యూటీ సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, పరిపాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లడం, ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల అమలు, ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు పరస్పర సమన్వయంతో పనిచేయాల్సిన అవసరంపై చర్చించినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో అధికార యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసేలా కృషి చేయాలని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించినట్లు తెలిసింది. సీఎస్ సంజయ్ జాజు తనకు ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ రాష్ట్ర అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నట్లు సమాచారం.

## టీజీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల.. సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, జూలై 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) తెలంగాణ స్టేట్ సీడ్ అండ్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీలో సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ నెం. 03/OG/SD/2026ను విడుదల చేసింది. రాష్ట్ర స్థాయి కేడర్‌లో మొత్తం 19 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు కమిషన్ ప్రకటించింది. అర్హులైన అభ్యర్థులు జూలై 7, 2026 నుంచి ఆగస్టు 12, 2026 వరకు టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. అభ్యర్థుల వయోపరిమితి 2026 జూలై 1 నాటికి 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలని, ఎంపికైన వారికి రూ.51,320 నుంచి రూ.1,27,310 వరకు వేతన శ్రేణి వర్తిస్తుందని పేర్కొంది. అర్హతగా వ్యవసాయంలో డిగ్రీతో పాటు సీడ్ టెక్నాలజీ, ప్లాంట్ బ్రీడింగ్, అగ్రానమీ లేదా ప్లాంట్ ఫిజియాలజీ విభాగాల్లో ఐసీఏఆర్ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఎంఎస్సీ (అగ్రికల్చర్) ఉత్తీర్ణులై ఉండాలని స్పష్టం చేసింది. పూర్తి నోటిఫికేషన్, అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలను టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించాలని కమిషన్ కార్యదర్శి (ఇన్‌చార్జ్) సూచించారు.



## ఏజెన్సీ నియోజకవర్గాలకు అదనంగా 2 వేల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సీఎం రేవంత్‌కు గిరిజన ఎమ్మెల్యేల వినతి

హైదరాబాద్, జూలై 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంత శాసనసభ నియోజకవర్గాలకు అదనంగా 2 వేల ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని ఆదివాసీ, గిరిజన ప్రాంతాలకు చెందిన శాసనసభ్యులు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని కోరారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క నేతృత్వంలో గిరిజన ఎమ్మెల్యేల బృందం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా ఆదివాసీ ప్రాంతాల్లో పోడు భూములకు పట్టాలు మంజూరు చేయడం, ఇందిర గిరి జల వికాసం పథకాన్ని అమలు చేయడం, ఐటీడీఏలను మరింత బలోపేతం చేయడం, గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఇంటర్మీడియట్ స్థాయి వరకు అప్‌గ్రేడ్ చేయడం వంటి కీలక డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహమ్మద్ అజారుద్దీన్ పాల్గొన్నారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యేల బృందం ముఖ్యమంత్రిని కోరగా, వారి వినతులను సానుకూలంగా పరిశీలిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు సమాచారం.




## బీఆర్ఎస్ గూండాగిరికి భయపడేది లేదు మంత్రి పొంగులేటి

హైదరాబాద్, జూలై 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ గూండాగిరికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం భయపడదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార–పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్ నాయకులు ఇంకా అధికారంలో ఉన్నామనే భ్రమతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రులు బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిని ప్రజల ముందుంచారని, అయినప్పటికీ నిరాధార ఆరోపణలతో ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. గత పదేళ్ల పాలనలో జరిగిన అవినీతిని ప్రస్తుత ప్రభుత్వంపై మోపే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు ఐదేళ్ల పాలనకు కాంగ్రెస్‌కు స్పష్టమైన తీర్పు ఇచ్చినా రెండున్నరేళ్లకే ప్రభుత్వం దిగిపోవాలని డిమాండ్ చేయడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. ప్రతి టెండర్‌లో మూడు, నాలుగు రెట్లు అవినీతి జరిగిందని ఆధారాలు లేకుండా ఆరోపించడం బీఆర్ఎస్ అవివేకానికి నిదర్శనమన్నారు. ఇదే ధోరణి కొనసాగితే భవిష్యత్తులో ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కదని హెచ్చరించారు. చర్చలకు రావాలని సవాల్ విసిరి, ప్రభుత్వం తరఫున మంత్రులు వెళ్లినప్పుడు బీఆర్ఎస్ నేతలే రాకుండా తప్పించుకున్నారని, గంటసేపు వేచి చూసిన తర్వాత మీడియాతో మాట్లాడి తిరిగి వచ్చారని తెలిపారు. అసెంబ్లీలోనూ బీఆర్ఎస్ చేసే ఆరోపణలకు ప్రభుత్వం సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## క్రైస్తవ మైనారిటీల ఆర్థిక సహాయ పథకానికి నేటి నుంచి దరఖాస్తులు

హైదరాబాద్, జూలై 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ క్రిస్టియన్ (మైనారిటీస్) ఫైనాన్స్ కార్పొరేషన్ 2026–27 ఆర్థిక సంవత్సరానికి ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్ కింద అర్హులైన క్రైస్తవ మైనారిటీ యువత నుంచి నేటి (జూలై 3) నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించింది. కుట్టు మిషన్, చిన్న వ్యాపార యూనిట్ల కోసం 21 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు, ఈ-బైక్, ఈ-స్కూటీ, మోటార్ బైక్ యూనిట్ల కోసం 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపింది. పట్టణ ప్రాంతాల్లో వార్షిక కుటుంబ ఆదాయం రూ.2 లక్షల లోపు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల లోపు ఉన్న క్రైస్తవ మైనారిటీ అభ్యర్థులు జూలై 3 నుంచి జూలై 18, 2026 సాయంత్రం 5 గంటల వరకు ప్రభుత్వ TSOBMMS పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పి. సబిత తెలిపారు. అర్హతలు, అవసరమైన పత్రాలు, దరఖాస్తు విధానం తదితర పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని, సందేహాల నివృత్తి కోసం కార్పొరేషన్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులైన క్రైస్తవ మైనారిటీ యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు త్వరలో టెండర్లు: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, జూలై 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): క్యూర్ (CURE) పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాంతంలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే టెండర్లు ఆహ్వానించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార-పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ మరో రెండు నుంచి మూడు రోజుల్లో పూర్తవుతుందని తెలిపారు. గురువారం గోషామహల్ నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, స్థానిక ఎమ్మెల్యే రాజాసింగ్‌లతో కలిసి లబ్ధిదారులకు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం "ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు" లక్ష్యంగా పనిచేస్తోందని పేర్కొంటూ, క్యూర్ పరిధిలోని 19 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఒక్కో నియోజకవర్గంలో 500 నుంచి 1000 ఇళ్ల వరకు నిర్మాణాన్ని ప్రారంభించి, అనంతరం దశలవారీగా మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే ఒక్కో నియోజకవర్గానికి 5,500 వరకు ఇళ్లు కేటాయించామని, పట్టణ ప్రాంతాల్లో భూముల విలువ అధికంగా ఉన్నప్పటికీ అదే ప్రాంతంలో పేదలకు ఇళ్లు నిర్మించి పట్టాలు అందజేస్తామని స్పష్టం చేశారు. ధూల్‌పేటలో గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిచిన 125 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి అందజేస్తున్నామని, మిగిలిన పేదలకు కూడా ఇళ్లు మంజూరు చేసేందుకు స్థలాల గుర్తింపునకు అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. పేదలను నగరాలకు దూరంగా తరలించే విధానం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉండదని, వారి జీవనాధారాలకు సమీపంలోనే గృహాలు నిర్మించడం ప్రభుత్వ విధానమన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలోనే ఎక్కువ ఇళ్లు నిర్మిస్తుందని, అది సాధ్యం కాకపోతే తాను ఎన్నికల్లో పోటీ చేయనని విసిరిన సవాల్‌కు ఇప్పటివరకు బీఆర్ఎస్ నుంచి స్పందన రాలేదని పేర్కొన్నారు. భారీ ప్రాజెక్టుల పేరుతో అవినీతికి పాల్పడిన గత ప్రభుత్వానికి భిన్నంగా, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యత ఇస్తూ ఇందిరమ్మ ఇళ్ల ద్వారా గుడిసెల్లేని తెలంగాణ లక్ష్యాన్ని సాధిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు జూలై 10 వరకు దరఖాస్తులు

సూర్యాపేట, జూలై 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు–2026 ఎంపిక ప్రక్రియకు సంబంధించి జిల్లాలోని అర్హులైన ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కె. అశోక్ సూచించారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో జిల్లాలోని అన్ని మండల విద్యాధికారులు, ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు జూలై 10, 2026 వరకు కేంద్ర విద్యాశాఖ అధికారిక పోర్టల్‌లో తమ దరఖాస్తులను, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో సమర్పించాలని తెలిపారు. జాతీయ స్థాయిలో విద్యా రంగంలో విశిష్ట సేవలు అందించిన ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించే ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుకు అర్హులైన ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పిలుపునిచ్చారు.

## పామాయిల్ తోటలతో సిరుల పంట.. వరి సాగుకు ప్రత్యామ్నాయంగా పామాయిల్‌ను ఎంచుకోవాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్





సూర్యాపేట, జూలై 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రైతులు సంప్రదాయ వరి సాగుపై ఆధారపడకుండా భవిష్యత్‌లో అధిక లాభాలు అందించే పామాయిల్ సాగు వైపు అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. సూర్యాపేట మండలం కాసరాబాద్ గ్రామంలోని ఆయిల్ పామ్ తోటలను శుక్రవారం పరిశీలించిన కలెక్టర్, పామాయిల్ సాగు చేస్తున్న రైతు ఆశబోయిన మల్లేష్‌తో మాట్లాడి సాగు విధానం, దిగుబడుల గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామాయిల్ రైతులకు సిరుల పంటగా మారుతుందని, ఒక్కసారి తోటను నాటితే నాలుగో సంవత్సరం నుంచి ప్రారంభమై దాదాపు 30 నుంచి 35 సంవత్సరాల పాటు స్థిరమైన ఆదాయం లభిస్తుందని తెలిపారు. వరి సాగుతో పోలిస్తే పామాయిల్‌లో పెట్టుబడి తక్కువగా ఉండటంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 70 నుంచి 90 శాతం వరకు సబ్సిడీ అందిస్తున్నాయని పేర్కొన్నారు. తోట నాటిన తొలి నాలుగు సంవత్సరాల వరకు ఎకరానికి రూ.4,200 చొప్పున పెట్టుబడి సహాయం అందుతుందని, మొక్కలు పూర్తిగా ఎదిగే వరకు కోకో, వక్క, మిరియాలు, తమలపాకు వంటి అంతర పంటలు సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకుని పామాయిల్ సాగును విస్తరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి తీగల నాగయ్య, వ్యవసాయ అధికారి కృష్ణ సందీప్, ఉద్యాన శాఖ అధికారులు, ఆయిల్ ఫెడ్ ప్రతినిధులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## కృష్ణా నది, పులిచింతలలో చేపల వేటపై ఆగస్టు 31 వరకు నిషేధం



సూర్యాపేట, జూలై 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): చేపల సంతానోత్పత్తి కాలాన్ని పరిరక్షించడం, చేపల సంపదను పెంపొందించడం, జలవనరుల స్థిరమైన వినియోగాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా కృష్ణా నది, పులిచింతల రిజర్వాయర్ పరిధిలో చేపల వేటపై అమలులో ఉన్న నిషేధాన్ని మత్స్యకారులు తప్పనిసరిగా పాటించాలని జిల్లా మత్స్యశాఖ అధికారి విజ్ఞప్తి చేశారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు కృష్ణా నది, పులిచింతల రిజర్వాయర్ పరిధిలో చేపల వేట పూర్తిగా నిషేధించబడిందని తెలిపారు. ఈ నిషేధిత కాలంలో ఎలాంటి వలలు, పడవలు లేదా ఇతర చేపల వేట పరికరాలను ఉపయోగించి చేపలు పట్టరాదని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి చేపల వేట చేపట్టే వారిపై అమలులో ఉన్న చట్టాలు, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చేపల వనరుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, మత్స్యకారులు, మత్స్య సహకార సంఘాల సభ్యులు, ప్రజలు ఈ నిషేధాన్ని స్వచ్ఛందంగా పాటించి చేపల సంపద పరిరక్షణకు సహకరించాలని జిల్లా మత్స్యశాఖ అధికారి కోరారు.

## నూతన సీఎస్ సంజయ్ జాజును మర్యాదపూర్వకంగా కలిసిన సీఈఓ సుదర్శన్ రెడ్డి



హైదరాబాద్, జూలై 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (చీఫ్ సెక్రటరీ)గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజును సంబంధిత సంస్థ సీఈఓ సుదర్శన్ రెడ్డి శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర అభివృద్ధి, పరిపాలనా సంస్కరణలు, ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా ప్రభుత్వ కార్యక్రమాల అమలులో సమన్వయంతో పనిచేయాల్సిన అవసరంపై ఇరువురు అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంలో అధికార యంత్రాంగం కీలక పాత్ర పోషించాలని ఈ సందర్భంగా చర్చించినట్లు తెలిసింది.

## బీసీ కళాకారులకు సువర్ణావకాశం.. బోనాల సందర్భంగా హైదరాబాద్‌లో ప్రదర్శన-కమ్-అమ్మకపు మేళా

సూర్యాపేట, జూలై 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2026 బోనాల పండుగ సందర్భంగా జూలై 16 నుంచి 26 వరకు హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్ (డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం–ఐమాక్స్ సమీపంలో) బీసీ కళాకారుల ప్రదర్శన-కమ్-అమ్మకపు మేళా ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి తెలిపారు. ఈ మేళాలో సుమారు 100 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కుండల తయారీదారులు, వెదురు హస్తకళాకారులు, ఇనుము, చెక్క హస్తకళాకారులు, నీరా ఉత్పత్తిదారులు, చేనేత కళాకారులు, తెలంగాణ సంప్రదాయ ఆహార ఉత్పత్తిదారులు తదితర అర్హులైన బీసీ వృత్తి కళాకారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించుకునే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రముఖులు హాజరుకానున్నారు. ఆసక్తి కలిగిన సూర్యాపేట జిల్లా బీసీ వృత్తి కళాకారులు జూలై 8న జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరై దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఎంపికైన ప్రతి స్టాల్‌కు ఇద్దరు ప్రతినిధులకు జిల్లా నుంచి హైదరాబాద్ వరకు ఒకవైపు ఉచిత రవాణా, 11 రోజులపాటు ఉచిత వసతి, టీ, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం వంటి సౌకర్యాలను ప్రభుత్వం కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అర్హులైన బీసీ వృత్తి కళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కళానైపుణ్యాన్ని ప్రదర్శించడంతో పాటు ఉత్పత్తులను విక్రయించుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కోరారు.

## సంగారెడ్డి జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదు.. జిల్లా సగటు 138.1 మి.మీ.

సంగారెడ్డి, జూలై 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లాలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఈ ఏడాది జూన్ 1 నుంచి జూలై 2 ఉదయం 8:30 గంటల వరకు నమోదైన వర్షపాతంలో జిల్లా సాధారణ స్థితిలో ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. జిల్లాలో ఈ కాలానికి సాధారణ వర్షపాతం 140.6 మిల్లీమీటర్లు కాగా, వాస్తవంగా 138.1 మిల్లీమీటర్లు నమోదు కావడంతో సాధారణం కంటే 1.7 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది. జిల్లా వ్యాప్తంగా 28 మండలాల్లో 13 మండలాలు సాధారణ వర్షపాతం, 3 మండలాలు అధిక వర్షపాతం, 7 మండలాలు లోటు వర్షపాతం, ఒక మండలం అతిభారీ వర్షపాతం, ఒక మండలం స్వల్ప వర్షపాతం విభాగంలో ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. జూలై 2న జిల్లాలో అత్యధికంగా గుమ్మడిదల మండలంలో 3.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, జిల్లా సగటు రోజువారీ వర్షపాతం 1.3 మిల్లీమీటర్లుగా నమోదైంది. మొత్తం మీద జిల్లాలో ప్రస్తుత వర్షాకాల పరిస్థితి సాధారణంగానే కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

## ముఖ్యమంత్రి విదేశీ విద్యా పథకం దరఖాస్తుల గడువు జూలై 15 వరకు పొడిగింపు

సంగారెడ్డి, జూలై 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో ఉన్న పేద మైనారిటీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న **ముఖ్యమంత్రి విదేశీ విద్యా పథకం (స్ప్రింగ్ సెషన్–2026)**కు దరఖాస్తుల గడువును జూలై 15, 2026 సాయంత్రం 5 గంటల వరకు పొడిగించినట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ అధికారి డి. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ప్రభుత్వం ఎంపిక చేసిన విదేశీ విశ్వవిద్యాలయాల్లో 2026 జనవరి 1 నుంచి జూన్ 30 మధ్య అడ్మిషన్ పొందిన వారు అయి ఉండాలని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన మైనారిటీ విద్యార్థులు అధికారిక ఈ-పాస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హతలు, విద్యార్హతలు, ఎంపికైన దేశాల జాబితా, ఎంపిక విధానం తదితర పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మరిన్ని వివరాల కోసం జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే దిశగా అర్హులైన మైనారిటీ విద్యార్థులు ముందుకు రావాలని జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ అధికారి డి. వెంకటేశ్వరరావు కోరారు.

## సంగారెడ్డి గురుకులాల్లో పార్ట్‌టైం టీచర్ల నియామకం.. జూలై 7 వరకు దరఖాస్తులు

సంగారెడ్డి, జూలై 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (TGSWREIS) ఆధ్వర్యంలో 2026–27 విద్యా సంవత్సరానికి సంగారెడ్డి జిల్లా పరిధిలోని 12 గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పార్ట్‌టైం ఉపాధ్యాయుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి జి. కల్పన తెలిపారు. జిల్లాలోని చిట్కుల్, ఇస్నాపూర్, ఆందోల్, రంజోల్, రాయికోడ్ బాలికల గురుకుల పాఠశాలలు, అంబేద్కర్ కళాశాల, హత్నూర, కొండాపూర్, నారాయణఖేడ్, నల్లవాగు, సింగూర్, న్యాల్కల్ బాలుర గురుకుల పాఠశాలల్లో జూనియర్ లెక్చరర్ (JL), పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (PGT), ట్రైయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (TGT), స్పెషల్ టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. సంబంధిత పోస్టులకు ప్రభుత్వం నిర్దేశించిన విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు జూలై 7, 2026 సాయంత్రం 4 గంటలలోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అభ్యర్థుల డెమో తరగతులు జూలై 8 ఉదయం 10 గంటలకు చిట్కుల్‌లోని జిల్లా సమన్వయ అధికారి కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లు, అనుభవ ధ్రువపత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు మరియు ఇతర అవసరమైన పత్రాలతో హాజరుకావాలని సూచించారు. ఎంపికైన పార్ట్‌టైం ఉపాధ్యాయులకు నెలకు జూనియర్ లెక్చరర్‌కు రూ.23,400, PGT/TGTలకు రూ.18,200, స్పెషల్ టీచర్లకు రూ.14,200 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. నియామకాల విషయంలో సంస్థ నిర్ణయమే తుది నిర్ణయమని, మరిన్ని వివరాలకు జిల్లా సమన్వయ అధికారి కార్యాలయం, చిట్కుల్ లేదా 97045 50253 నంబర్‌ను సంప్రదించాలని జిల్లా సమన్వయ అధికారి జి. కల్పన సూచించారు.

## యూరియా బుకింగ్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ.. జిల్లాలో లక్షకు పైగా బస్తాలు అందుబాటులో

సంగారెడ్డి, జూలై 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా ఎరువులను పారదర్శకంగా, సకాలంలో అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యూరియా బుకింగ్ యాప్ ద్వారా జిల్లాలో ఎరువుల పంపిణీ కొనసాగుతోందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా జిల్లాకు మొత్తం 2,89,963 యూరియా బస్తాల సరఫరాకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం జిల్లాలోని వివిధ ఎరువుల కేంద్రాల్లో 1,03,217 యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. నారాయణఖేడ్‌లో 16,434, రాయికోడ్‌లో 12,946, పటాన్‌చెరులో 11,964, గుమ్మడిదలలో 7,004, మునిపల్లిలో 4,926, జహీరాబాద్‌లో 4,882, అందోల్‌లో 4,576, కోహీర్‌లో 4,053, జిన్నారంలో 4,033, హత్నూరలో 3,495 బస్తాలు నిల్వ ఉన్నాయని తెలిపారు. యూరియా అవసరమైన రైతులు ముందుగా యూరియా బుకింగ్ యాప్ ద్వారా బుక్ చేసుకుని, కేటాయించిన ఎరువుల దుకాణంలో 15 రోజులలోపు ఎరువులను పొందాలని సూచించారు. బుకింగ్ కోసం సమీప వ్యవసాయ విస్తరణ అధికారి (AEO), రైతు వేదికలు, మీ సేవ కేంద్రాలు లేదా అధీకృత ఎరువుల దుకాణాలను సంప్రదించాలని తెలిపారు. రైతులు అవసరమైన మేరకే యూరియాను కొనుగోలు చేయాలని, అనవసరంగా నిల్వ చేయవద్దని సూచిస్తూ, జిల్లాలో తగినంత యూరియా నిల్వలు ఉన్నందున ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ స్పష్టం చేశారు.



## ఖమ్మం జిల్లాలో యూరియా కొరత లేదు.. రైతులు ఆందోళన చెందొద్దు: జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

ఖమ్మం, జూలై 3 (సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జి శెట్టి సురేష్): వానాకాలం-2026 సీజన్‌లో ఖమ్మం జిల్లాలో రైతులకు అవసరమైన మేరకు యూరియా ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఖమ్మం జిల్లాకు మొత్తం 35,267 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించిందని, ప్రస్తుతం జిల్లాలో 17,156.88 మెట్రిక్ టన్నుల యూరియా (3,81,264 బస్తాలు) నిల్వ ఉన్నట్లు వెల్లడించారు. ప్రైవేట్ డీలర్ల వద్ద 15,359 బస్తాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద 20,445 బస్తాలు, మార్క్‌ఫెడ్ ఖమ్మం వద్ద 1,70,137 బస్తాలు, కంపెనీ గోదాముల్లో 22,034 బస్తాలు, కమిషనర్ రిజర్వ్ పూల్ (సీఆర్‌పీ)లో 1,53,290 బస్తాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో యూరియా పంపిణీని పూర్తిగా యూరియా యాప్ ద్వారా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు 56,926 మంది రైతులు 1,80,738 బస్తాలను బుక్ చేసుకోగా, అందులో 1,60,316 బస్తాలను కొనుగోలు చేశారని వివరించారు. రైతులు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా అవసరమైన మేరకే యూరియాను కొనుగోలు చేయాలని, ప్రతి మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ నిరంతరం చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య స్పష్టం చేశారు.



## పటాన్‌చెరు పర్యటనలో ఎంపీ రఘునందన్‌రావు.. పేదలకు న్యాయం చేస్తామని హామీ

పటాన్‌చెరు, జూలై 3 (సందేశం టైమ్స్ బి. డేవిడ్): పటాన్‌చెరు నియోజకవర్గంలోని జేపీ కాలనీ డివిజన్ పరిధిలో రైల్వే భూమిలో నివాసాలు ఏర్పాటు చేసుకున్న పేదల విజ్ఞప్తి మేరకు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు గురువారం బండ్లగూడ ప్రాంతంలో పర్యటించారు. దోసెన్ చెరువు నుంచి పటాన్‌చెరు రైల్వే స్టేషన్ వరకు కాలినడకన పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎంపీ, సంబంధిత అధికారులు తనను కలిసి పూర్తి వివరాలు అందించాలని ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, గతంలో పటాన్‌చెరు వరకు ఉన్న రైల్వే ట్రాక్‌ను తొలగించిన తర్వాత అక్కడ పేదలు ఇళ్లు నిర్మించుకున్నారని తన దృష్టికి వచ్చిందని తెలిపారు. రైల్వే భూమిలో నిర్మాణాలు చట్టబద్ధం కాకపోయినా, పేదలకు న్యాయం జరిగేలా వారి తరఫున రైల్వే అధికారులతో చర్చిస్తామని, త్వరలోనే అధికారులతో కలిసి స్థలాన్ని మరోసారి పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పటాన్‌చెరు రైల్వే స్టేషన్‌ను సందర్శించిన ఆయన, స్టేషన్ ప్రహరీ వద్ద అక్రమంగా గేట్ ఏర్పాటు చేసి, రైల్వే స్థలాన్ని ఆక్రమించి బోర్‌వెల్ తవ్విన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రైల్వే అధికారులకు ఫోన్ చేసి, అక్రమ ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నిస్తూ, తక్షణమే నోటీసులు జారీ చేసి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పాత ఈఎస్ఐ క్లినిక్ స్థలాన్ని పరిశీలించిన ఎంపీ, ఆ స్థలాన్ని కార్మికులకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేస్తామని, త్వరలోనే కార్మిక శాఖ అధికారులతో కలిసి పర్యటించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, బండ్లగూడ బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు భరత్, బీజేపీ నాయకులు రాజశేఖర్ రెడ్డి, మురళీధర్ వర్మ, గొల్ల కృష్ణ, అడ్వకేట్ విజయ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



## మీడియాపై పోలీసుల దాడిని ఖండించిన తెలుగు జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్

హైదరాబాద్, జూలై 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌లో విధి నిర్వహణలో ఉన్న మీడియా ప్రతినిధులపై పోలీసులు వ్యవహరించిన తీరును తెలుగు జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (TJWA) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకటేష్ గౌడ్ విడుదల చేసిన ప్రకటనలో, జర్నలిస్టులను పోలీస్ స్టేషన్‌లో ఉండవద్దని హెచ్చరించడం, అనంతరం వారిపై దాడికి పాల్పడినట్లు వస్తున్న వార్తలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి, రాజ్యాంగం కల్పించిన పత్రికా స్వేచ్ఛకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజలకు వాస్తవ సమాచారాన్ని చేరవేయడం జర్నలిస్టుల రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని, వారి విధి నిర్వహణకు ఆటంకం కలిగించడం, బెదిరించడం లేదా దాడులకు పాల్పడడం ఏ పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదన్నారు. దాడికి గురైన జర్నలిస్టులకు తెలుగు జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పూర్తి సంఘీభావం ప్రకటిస్తోందని, రాష్ట్రంలోని ప్రతి జర్నలిస్టు హక్కులు, గౌరవం, భద్రత కోసం సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కంచన్‌బాగ్ ఘటనపై వెంటనే నిష్పాక్షిక విచారణ జరిపి, బాధ్యులైన పోలీసు సిబ్బందిపై చట్టపరమైన, శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, పోలీసు ఉన్నతాధికారులను TJWA డిమాండ్ చేసింది. అలాగే విధి నిర్వహణలో ఉన్న మీడియా ప్రతినిధుల భద్రతకు ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వడంతో పాటు, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని శెట్టి వెంకటేష్ గౌడ్ కోరారు.



## మెదక్ జిల్లా చరిత్రలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు.. రైతుల ఖాతాల్లో రూ.1,005.66 కోట్లు జమ

మెదక్, జూలై 3 (సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి): మెదక్ జిల్లా చరిత్రలోనే ఈ యాసంగి సీజన్‌లో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిస్థాయిలో విజయవంతంగా ముగించామని వెల్లడించారు. గత యాసంగితో పోలిస్తే ఈసారి 1.08 లక్షల మెట్రిక్ టన్నుల మేర అధిక దిగుబడి నమోదైందని, మొత్తం 4,28,361 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 1,01,752 మంది రైతుల నుంచి సేకరించినట్లు తెలిపారు. సేకరించిన ధాన్యానికి సంబంధించిన రూ.1,005.66 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. ఏప్రిల్ 8న ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లు జూన్ 27తో పూర్తయ్యాయని తెలిపారు. జిల్లాలో మొత్తం 533 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, వాటిలో పీఏసీఎస్-305, ఐకేపీ-185, డీసీఎంఎస్-43 కేంద్రాల ద్వారా కొనుగోళ్లు నిర్వహించినట్లు వివరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడంలో మీడియా కీలక పాత్ర పోషించిందని, మీడియా ప్రతినిధులు చేసిన సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని అనేక చర్యలు చేపట్టామని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే జిల్లాలో జొన్నల కొనుగోలు కూడా కొనసాగుతోందని, రైతులు సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని సూచించారు. నాణ్యమైన జొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందని, ఇప్పటివరకు 3,609 మంది రైతుల నుంచి 6,347 మెట్రిక్ టన్నుల జొన్నలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నాగేష్, జిల్లా సివిల్ సప్లై అధికారి పి. నిత్యానందం, సివిల్ సప్లై మేనేజర్ జగదీష్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్‌రావు, జిల్లా పౌరసంబంధాల అధికారి రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

## సహకార వారోత్సవాల్లో హరితహారం,పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి: సొసైటీ చైర్మన్ ప్రభాకర్



మెదక్, జూలై 3 (సందేశం టైమ్స్ న్యూస్ ప్రతినిధి - కొల్చారం): సహకార వారోత్సవాలను పురస్కరించుకుని మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతం గ్రామంలో శుక్రవారం హరితహారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సొసైటీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణ అత్యంత అవసరమని, పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టి భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చెట్లు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని, విద్యార్థులు ప్రకృతి పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సొసైటీ సభ్యులు పాల్గొని హరితహారాన్ని విజయవంతం చేశారు.




## మాన్సూన్‌పై ముందస్తు కార్యాచరణతో అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, జూలై 3 (సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి): వర్షాకాలంలో సీజనల్, అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు కార్యాచరణ ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ ప్రజావాణి హాల్‌లో వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, విద్యాశాఖ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రజారోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, హైరిస్క్ గ్రామాల్లో ముందస్తుగా వైద్య శిబిరాలు నిర్వహించాలని, ఫీవర్ సర్వేలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన అన్ని ప్రాణరక్షక మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలని, వైద్యులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో శానిటేషన్ కార్యక్రమాలను పగడ్బందీగా అమలు చేసి, మురుగు కాల్వలను శుభ్రం చేయడంతో పాటు దోమల లార్వా నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పరీక్షలు నిర్వహించి చికిత్స అందించాలని సూచించారు. జూలై 13న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (National Deworming Day) విజయవంతానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, జూలై 20న నిర్వహించే మాప్-అప్ కార్యక్రమాన్ని కూడా సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణలో వైద్య, పంచాయతీ మరియు ఇతర శాఖల సమిష్టి కృషి కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నాగేష్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. గణేశ్వర్, డీసీహెచ్ఎస్ డా. శివదయాళ్, జిల్లా విద్యాశాఖాధికారి రాజు, డీపీవో యాదయ్య, డీపీఆర్వో రామచంద్రరాజు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. సృజనతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.




## పెండింగ్ కేసుల పరిష్కారం వేగవంతం చేయాలి

### డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం నిర్వహించాలి: జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

మెదక్, జూలై 3 (సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి): ప్రజలకు నాణ్యమైన, పారదర్శక పోలీసు సేవలు అందించడంతో పాటు పెండింగ్ కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నార్సింగి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన స్టేషన్ నిర్వహణ, రికార్డులు, పెండింగ్ కేసులు, నేర నియంత్రణ చర్యలు, సిబ్బంది విధి నిర్వహణ, స్టేషన్ పరిసరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షిస్తూ వాటిని త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ సృజనకు సూచించారు. కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యానికి తావు లేకుండా సమయపాలనతో విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ట్రాఫిక్ నియంత్రణతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిరంతరం నిర్వహించాలని, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన ఎస్పీ, ప్రధాన కూడళ్లు, వ్యాపార ప్రాంతాలు, ఇతర కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి ఫిర్యాదులను వెంటనే నమోదు చేసి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమైన ఎస్పీ, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీలో రామాయంపేట్ సీఐ సైదా, ఎస్ఐ సృజనతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## మహిళా సంఘాల అభివృద్ధికి కీలక నిర్ణయం

### గ్రామ సమాఖ్య భవనం, వర్క్‌షెడ్ నిర్మాణానికి స్థలం కేటాయింపు

ఖమ్మం, జూలై 3 (సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జ్ శెట్టి సురేష్): మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతం, ఆర్థిక సాధికారతకు ఊతమిచ్చే దిశగా నాగులవంచ గ్రామపంచాయతీ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామంలో ఉన్న మూడు గ్రామ సమాఖ్యలు, 110 స్వయం సహాయక సంఘాలు, సుమారు 1,200 మంది మహిళా సభ్యులకు సమావేశాలు, శిక్షణలు నిర్వహించుకునేందుకు ప్రత్యేక వేదిక లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించిన గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ప్రత్యేక తీర్మానం చేసింది. గ్రామ సమాఖ్య సమావేశ భవనం, మహిళల నైపుణ్యాభివృద్ధి కోసం వర్క్‌షెడ్ నిర్మాణానికి ఎన్ఎస్పీ క్వార్టర్స్ ప్రాంతంలో తగిన స్థలాన్ని కేటాయిస్తూ తీర్మాన ప్రతులను చందమామ గ్రామ సమాఖ్య ప్రతినిధులకు అందజేశారు. ఈ వర్క్‌షెడ్‌లో టైలరింగ్, యూనిఫాం స్టిచింగ్, బ్యూటీషియన్ శిక్షణ, జ్యూట్ బ్యాగుల తయారీ, పిండి వంటలు, చేతివృత్తులు వంటి ఉపాధి ఆధారిత శిక్షణ కార్యక్రమాలు గ్రామంలోనే నిర్వహించేందుకు అవకాశం కలగనుంది. దీంతో మహిళలు శిక్షణ కోసం ఖమ్మం వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నైపుణ్యాలు పెంపొందించుకుని స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోగలరని సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ సమాఖ్య భవనం ఏర్పాటుతో 110 మహిళా సంఘాలకు చెందిన 1,200 మంది సభ్యులు సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు, శిక్షణా కార్యక్రమాలను ఒకే వేదికపై నిర్వహించుకునే సౌకర్యం లభించనుంది. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అంబటి శరత్, గ్రామ కార్యదర్శి చిరంజీవి, గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు బీ జాన్ బీ, సీసీ భాస్కరరావు, గ్రామ సమాఖ్య సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## వికసిత్ భారత్ బిల్డ్‌థాన్-2025లో తూప్రాన్ గీతా స్కూల్ విద్యార్థుల ప్రతిభ

### జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించిన అదనపు కలెక్టర్ నగేష్

మెదక్, జూలై 3 (సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి): వికసిత్ భారత్ బిల్డ్‌థాన్-2025 రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ పోటీల్లో మెదక్ జిల్లా తూప్రాన్‌లోని గీతా స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో మహతి, కృత్తిక, రాజేష్, ఆశీష్ సంయుక్తంగా రూపొందించిన ప్రాజెక్టు తెలంగాణ నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన మూడు ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలవడంతో వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అపూర్వ మేధాశక్తి, సృజనాత్మకతకు ఇది నిదర్శనమని కొనియాడారు. ప్రతిభకు పదును పెట్టి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ రూపొందించిన ఈ ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన ఈ ప్రాజెక్టుకు రూ.25 వేల నగదు పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని ఇతర విద్యార్థులు కూడా విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో ప్రతిభ చాటుతూ జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రాజు, సివిల్ సప్లై అధికారులు నిత్యానందం, జగదీశ్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఉపాధ్యాయుడు రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో పాల్గొన్న నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి,పలు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకుడు





మెదక్, జూలై 3 (సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి): నర్సాపూర్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. శివ్వంపేట, దంతన్‌పల్లి, దామరంచ, నెల్లూరు గ్రామాల్లో కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశం చేసిన కుటుంబాలను అభినందిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కృషి చేస్తోందన్నారు. అనంతరం నియోజకవర్గంలోని పలు వివాహ వేడుకలకు హాజరైన ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కమదన కిషన్‌రావు పార్థివ దేహానికి ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు నివాళి



ఖమ్మం, జూలై 3 (సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జ్ చిట్టి సురేష్): నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామానికి చెందిన కమదన కిషన్‌రావు అకాల మరణం పట్ల ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం చెన్నారం గ్రామానికి చేరుకుని కిషన్‌రావు పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మనోధైర్యం చెప్పారు. కిషన్‌రావు కుటుంబానికి భగవంతుడు ఈ దుఃఖాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చెన్నారం గ్రామ బీఆర్ఎస్ నాయకులు కిలారు వెంకన్న, మధుసూదనరావు, కోదాటి శ్రీను, అవుట మధు, నాగార్జున, తోళ్ల నాగేశ్వరరావు, తిరుమలాపురం గ్రామ సర్పంచ్ కమదన ప్రవీణ్, మండల సోషల్ మీడియా అధ్యక్షుడు మాదాసు ఆదాం, తోళ్ల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొని కమదన కిషన్‌రావు పార్థివ దేహానికి నివాళులర్పించారు.

# జోగిపేట 13వ వార్డులో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రారంభం





అందోల్, జూలై 3 (సందేశం టైమ్స్ అందోల్ మండల ప్రతినిధి): జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) సప్న ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణలు, చిరునామా మార్పులు, మరణించిన వారి పేర్ల తొలగింపు తదితర ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా బీఎల్ఏలు ఆకుల గణేష్, నాగరాజు ఓటర్లకు అవగాహన కల్పిస్తూ, ప్రతి అర్హత కలిగిన పౌరుడు తన ఓటరు వివరాలను తప్పనిసరిగా ధృవీకరించుకొని గణన ఫారాన్ని పూర్తి చేసి సమర్పించాలని సూచించారు. ఫారం సమర్పించని వారి పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించబడే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జోగిపేట ప్రధాన కార్యదర్శి మేదరి పాపయ్య పాల్గొని ఓటర్లను ప్రత్యేక సవరణ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.




# పోక్సో, అత్యాచార బాధితులకు వేగవంతమైన సేవలు అందించాలి: జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి, జూలై 3 (సందేశం టైమ్స్): పోక్సో, అత్యాచార కేసుల్లో మహిళలు, చిన్నారుల రక్షణకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి బాధితులకు త్వరితగతిన న్యాయం, వైద్య సహాయం, కౌన్సెలింగ్, పునరావాస సేవలు అందించాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో భరోసా సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్టేక్‌హోల్డర్స్ కన్వర్జెన్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బాధితులకు అన్ని సేవలను ఒకే వేదికపై అందించడంతో పాటు వారు మళ్లీ మానసిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ట్రామా హీలింగ్, కౌన్సెలింగ్, పునరావాస కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. భరోసా సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్ నియామకం, వైద్య పరీక్షల నివేదికల నాణ్యత మెరుగుదల, సీడబ్ల్యూసీ సమావేశాలను భరోసా సెంటర్‌లో నిర్వహించడం, విక్టిమ్ కాంపెన్సేషన్ పెండింగ్ కేసుల పురోగతి, చదువు మానేసిన బాధిత బాలికలను తిరిగి విద్యాసంస్థల్లో చేర్పించడం, పోక్సో చట్టాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి అంశాలపై సమావేశంలో సమీక్షించారు. అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి మాట్లాడుతూ అన్ని శాఖలు బాధ్యతాయుతంగా సమన్వయంతో పనిచేస్తే బాధితులకు మరింత మెరుగైన సేవలు అందుతాయని అన్నారు. ఈ సమావేశంలో డీఎల్ఎస్ఏ సౌజన్య, డీఎంఅండ్‌హెచ్‌వో డా. లలిత కుమారి, సీడబ్ల్యూసీ చైర్మన్ రాజారెడ్డి, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సూర్‌రెడ్డి, సత్యనారాయణ, డీడబ్ల్యూఓ లలిత కుమారి, డీఆర్‌డీఏ జ్యోతి, డీఎస్పీలు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, భరోసా సెంటర్ కో-ఆర్డినేటర్ దేవలక్ష్మి, పోలీసు అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ బడి విద్యార్థులకు బ్యాగులు, పండ్లు పంపిణీ చేసిన మహమ్మద్ మదర్

మెదక్, జూలై 3 (సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి): పుల్కల్ మండలం ముద్దాయిపేట్ గ్రామానికి చెందిన మహమ్మద్ మదర్ సేవా కార్యక్రమాలతో సమాజానికి ఆదర్శంగా నిలిచారు. గురువారం ముద్దాయిపేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన తన సొంత నిధులతో విద్యార్థులకు నూతన పాఠశాల బ్యాగులు, పెన్నులు పంపిణీ చేశారు. అలాగే పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అరటి పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లను అందజేశారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని, విద్యపై మరింత ఆసక్తి పెంచేందుకు దోహదపడుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. స్వార్థం లేకుండా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ముందుకు వచ్చి సేవా కార్యక్రమం నిర్వహించిన మహమ్మద్ మదర్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు అభినందించారు.




# రిటైర్డ్ ఎస్సైతో దురుసు వ్యవహారం.. మధురానగర్ ఎస్సైపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, జూలై 3 (సందేశం టైమ్స్): చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులే చట్టాన్ని ఉల్లంఘిస్తే సహించబోమంటూ మధురానగర్ పోలీస్ స్టేషన్ ఎస్సై తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. శుక్రవారం రిటైర్డ్ ఎస్సై ఉస్మాన్ (75) దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ టీ. మాధవీదేవి ధర్మాసనం, సంబంధిత ఎస్సైను మధ్యాహ్న భోజన విరామం వరకు కోర్టులోనే నిలబడాలని ఆదేశించింది. అలాగే ఈ ఘటనపై పోలీస్ కమిషనర్ సమగ్ర నివేదికను సమర్పించాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 15వ తేదీకి వాయిదా వేసింది. యూసుఫ్‌గూడలోని తన నివాసంలో మే 18న లోదుస్తుల్లో ఉన్న సమయంలో పోలీసులు బలవంతంగా ఇంటి నుంచి ఈడ్చుకెళ్లారని, తనపై జరిగిన అవమానకర ఘటనపై సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని రిటైర్డ్ ఎస్సై ఉస్మాన్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం పోలీసుల ప్రవర్తనపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ చట్టాన్ని అమలు చేసే అధికారులు చట్టబద్ధంగా వ్యవహరించాలని స్పష్టం చేసింది.




# పెండింగ్ డీఏలు, పీఆర్సీ వెంటనే విడుదల చేయాలి: పీఆర్టీయూ డిమాండ్

ఖమ్మం, జూలై 3 (సందేశం టైమ్స్): రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీ, పెండింగ్ బిల్లులు, పెన్షనర్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఉద్యోగులు–ఉపాధ్యాయులకు ఉపయోగపడేలా హెల్త్ కార్డులను అమలు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చింతకాని మండల పీఆర్టీయూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. సీపీఎస్ రద్దుపై ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, పెండింగ్ డీఏలు, పెన్షనర్ల బకాయిలు, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులందరికీ ప్రయోజనం చేకూరే విధంగా హెల్త్ కార్డుల మార్గదర్శకాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అంతకుముందు మండలంలోని పందిళ్లపల్లి, నామవరం, తిమ్మినేనిపాలెం, చిన్న మండవ, నాగులవంచ, నేరడ తదితర పాఠశాలల్లో సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించగా, బడిబాట, జనగణన విధులను విజయవంతంగా పూర్తి చేసిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు విజయ్ అమృత్‌కుమార్, మండల అధ్యక్షుడు ఎన్. విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శి బి. ప్రభాకర్‌రెడ్డి, జిల్లా బాధ్యుడు టి. సుదర్శనం, మండల నాయకులు చందర్రావు, సత్యనారాయణరెడ్డి, కృష్ణారావు, నాగేశ్వరరావు, సురేష్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్ర–సాంకేతిక శాఖ అభివృద్ధిపై మంత్రి దామోదర రాజనరసింహతో ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్ భేటీ



హైదరాబాద్, జూలై 3 (సందేశం టైమ్స్): ఇటీవల తెలంగాణ ప్రభుత్వ శాస్త్ర–సాంకేతిక శాఖ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ అధికారి శైలజా రామయ్యర్ శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో వైద్య, ఆరోగ్య & కుటుంబ సంక్షేమ, శాస్త్ర–సాంకేతిక శాఖల మంత్రి దామోదర రాజనరసింహను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాస్త్ర–సాంకేతిక శాఖ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చేపట్టాల్సిన చర్యలు, శాఖల సమన్వయంతో అమలు చేయనున్న ప్రణాళికలపై ఇరువురు సంక్షిప్తంగా చర్చించారు. అనంతరం మంత్రి దామోదర రాజనరసింహ శైలజా రామయ్యర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజా సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని సమర్థవంతంగా పనిచేసి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు.



## ధరణి, భూ భారతి పోర్టల్ల అక్రమాలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు

సంగారెడ్డి, జూలై 3 (సందేశం టైమ్స్): ధరణి, భూ భారతి పోర్టళ్లలో వెలుగులోకి వచ్చిన అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోందని, బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నివారణ చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో ధరణి పోర్టల్‌పై కొనసాగుతున్న ఫోరెన్సిక్ ఆడిట్‌లో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని చెప్పారు. ధరణి పోర్టల్ సాంకేతిక నిర్మాణంలో ఉన్న భద్రతా లోపాలను కొందరు దుర్వినియోగం చేసి అనధికారిక ఎంట్రీలు చేసినట్లు గుర్తించామని, అదే నమూనాలో రూపొందించిన భూ భారతి పోర్టల్‌లో కూడా ఇలాంటి లోపాలు తలెత్తే అవకాశం ఉన్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో బాధ్యులను గుర్తించడం, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం, భవిష్యత్తులో అత్యున్నత భద్రతా ప్రమాణాలతో కొత్త సిస్టమ్‌ను రూపొందించేందుకు మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రతినిధులు, ఎన్ఐసీ సీనియర్ డైరెక్టర్ ఏ. శ్రీనివాస సుబ్బారావు తదితరులతో ప్రత్యేక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీ 15 రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుండగా, ఆ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామని, భూముల రికార్డుల భద్రత, పారదర్శకత విషయంలో ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడదని డి.ఎస్. లోకేష్ కుమార్ స్పష్టం చేశారు.



## పద్మశాలి అంజన్న పంతులు కుమార్తె వివాహానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

సందేశం టైమ్స్ సదాశివపేట, జూలై 03 (ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని బసవ సేవా సదన్ కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించిన పద్మశాలి అంజన్న పంతులు కుమార్తె వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిపల్లి మండలం మాజీ జడ్పీటీసీతో పాటు అంతరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకటేశం, విట్టల్, పండరి, వెంకటేశం, గురుస్వామి, సిద్ధన్న పటేల్ (రాజు), ప్రొడక్షన్ లీగల్ సర్వీస్ సంగారెడ్డి జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఎస్. రవీందర్ తదితరులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట పగిలిన మ్యాన్‌హోల్.. రోగులకు ప్రమాదకరంగా మారిన ఇనుప రాడ్లు






సందేశం టైమ్స్ సంగారెడ్డి, జూలై 03 (ప్రతినిధి): సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన ప్రవేశ ద్వారం ఎదురుగా ఉన్న డ్రైనేజీ కాల్వపై ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్ మూత పగిలిపోవడంతో అందులోని ఇనుప రాడ్లు బయటకు వచ్చి రోగులు, వారి సహాయకులకు తీవ్ర ప్రమాదకరంగా మారాయి. ఆసుపత్రికి రోజూ వందలాది మంది రోగులు, వృద్ధులు, చిన్నారులు రాకపోకలు సాగించే ప్రధాన మార్గంలోనే ఈ దెబ్బతిన్న మ్యాన్‌హోల్ ఉండటంతో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు, రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చే అంబులెన్సులు, ఇతర వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్, వైద్యశాఖ అధికారులు వెంటనే స్పందించి పగిలిన మ్యాన్‌హోల్‌ను మరమ్మతులు చేసి కొత్త మూత ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు, రోగులు కోరుతున్నారు.

## కంగ్టి బీసీ సంక్షేమ హాస్టల్‌పై సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



సందేశం టైమ్స్ కంగ్టి ప్రతినిధి, జూలై 03: సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ బాలుర హాస్టల్‌ను సబ్ కలెక్టర్ ఉమా హారతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న వసతి, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర సౌకర్యాలను పరిశీలించారు. హాస్టల్ ఆవరణలో దెబ్బతిన్న ప్రహరీ గోడ, మరుగుదొడ్ల నిర్వహణలో ఉన్న లోపాలు, పారిశుద్ధ్య సమస్యలను స్వయంగా పరిశీలించిన ఆమె సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న మరమ్మతు పనులను తక్షణమే ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన ఆహారం, సురక్షితమైన నివాస సౌకర్యాలు నిరంతరం అందుబాటులో ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావు లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీతో హాస్టల్‌లో ఉన్న సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయనే ఆశాభావాన్ని విద్యార్థులు వ్యక్తం చేశారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి: బీసీ సంఘాల డిమాండ్



సందేశం టైమ్స్ సంగారెడ్డి, జూలై 03 (ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి బీసీ విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని బీసీ సంక్షేమ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కళాశాలల బంద్ కార్యక్రమం సంగారెడ్డి జిల్లాలో విజయవంతంగా నిర్వహించినట్లు నియోజకవర్గ అధ్యక్షుడు బాలు యాదవ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.8,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని, దీని వల్ల వేలాది మంది బీసీ విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల చదువు ఆగిపోతే రాష్ట్ర భవిష్యత్తే దెబ్బతింటుందని పేర్కొంటూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం ప్రభుత్వం బాధ్యత, విద్యార్థుల హక్కు అని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని చేపట్టి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా నిలదీస్తామని హెచ్చరించారు. ఈ బంద్ కార్యక్రమానికి బీసీ విద్యార్థి సంఘాలు, బీసీ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో మద్దతు తెలుపుతూ పాల్గొన్నారు.



## బండ్లగూడ కాలనీలో ఎంపీ రఘునందన్ రావు పర్యటన.. బాధితులకు న్యాయం చేస్తామని హామీ

సందేశం టైమ్స్ పటాన్చెరు, జూలై 03 (ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలోని జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని బండ్లగూడ కాలనీలో రైల్వే ట్రాక్‌కు ఆనుకుని ఉన్న ఇళ్లకు రైల్వే అధికారులు మార్కింగ్ వేయడంతో ఆందోళనకు గురైన స్థానికులను పరామర్శించేందుకు మెదక్ పార్లమెంట్ సభ్యుడు ఎం. రఘునందన్ రావు గురువారం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి తదితరులతో కలిసి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులతో మాట్లాడిన ఎంపీ, వారి సమస్యలను రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రైల్వే మార్కింగ్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకునేందుకు సంబంధిత అధికారులతో చర్చిస్తామని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి హక్కులను పరిరక్షించేందుకు బీజేపీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆరోగ్య సమస్యలతో మహిళ ఆత్మహత్య.. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు



సందేశం టైమ్స్ కొల్చారం, జూలై 03 (ప్రతినిధి): మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్ర పరిధిలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మృతురాలు ఎండుగుల విజయమ్మ (59) గత కొంతకాలంగా తీవ్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో జూలై 2వ తేదీ ఉదయం గ్రామ శివారులో ఆమె మృతదేహం లభ్యమవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.







## ప్రైవేట్ స్కూల్ బస్సు ఆకస్మిక తనిఖీ.. ఫిట్‌నెస్ ధ్రువపత్రాలు చూపించాలని తల్లిదండ్రుల డిమాండ్

సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి అనిల్ కుమార్, జూలై 03: మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని బహిరన్‌దిబ్బ గ్రామంలో విద్యార్థుల భద్రత దృష్ట్యా గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు గురువారం ప్రైవేట్ డాన్ బస్కో స్కూల్ బస్సును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్సు ఫిట్‌నెస్, డ్రైవర్‌కు చెల్లుబాటు అయ్యే లైసెన్స్ ఉందా, వాహనం రోడ్డు భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉందా అనే అంశాలను పరిశీలించారు. బస్సు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ప్రభుత్వ కార్యాలయంలో సమర్పించారా లేదా అనే విషయాన్ని డ్రైవర్‌ను ప్రశ్నించడంతో పాటు, మూడు రోజుల్లోపు సంబంధిత ధ్రువపత్రాలను చూపించాలని ఆదేశించారు. నిబంధనలు పాటించకపోతే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకునేలా చూస్తామని హెచ్చరించారు. విద్యార్థుల ప్రాణ భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, పాఠశాల యాజమాన్యం అన్ని భద్రతా ప్రమాణాలను పాటిస్తూ పిల్లలకు సురక్షిత రవాణా కల్పించాలని తల్లిదండ్రులు కోరారు. ఈ కార్యక్రమంలో శివన్న, వీరప్ప, భూమప్ప, మానేప్ప, నర్సప్ప, ఈశ్వరప్ప, శరణ్, మల్లేశం తదితర గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## సింగూర్ డ్యాం మరమ్మతు పనులపై మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అసంతృప్తి

సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, జూలై 03: అందోల్ నియోజకవర్గంలోని సింగూర్ డ్యాంలో కొనసాగుతున్న మరమ్మతు పనులను గురువారం మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పరిశీలించి పనుల నాణ్యతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. డ్యాంలో మరమ్మతులు అవసరమైన ప్రాంతంలో కాకుండా వేరే చోట పనులు చేపడుతున్నారని, "గాయం ఒకచోట అయితే కట్టు మరోచోట కట్టినట్లుగా" పనులు సాగుతున్నాయని విమర్శించారు. మరమ్మతులకు వినియోగిస్తున్న ఇసుక కూడా నాణ్యత లేనిదని, శివ్వంపేట బ్రిడ్జి ప్రాంతం నుంచి తీసుకొస్తున్న ఇసుకతో నాణ్యమైన పనులు సాధ్యం కాదని అన్నారు. గత ఏడాదే ప్రారంభం కావాల్సిన డ్యాం మరమ్మతులు మూడు నెలల క్రితమే ప్రారంభం కావడం ప్రభుత్వ, ఇరిగేషన్ శాఖల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. గత ఏడాదే పనులు పూర్తయి ఉంటే ఈ వానాకాలానికి డ్యాంలో నీటి నిల్వలు ఏర్పడి అందోల్ నియోజకవర్గ రైతులకు సాగునీరు అందేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరమ్మతు పనులను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేసి కనీసం వచ్చే ఏడాదికైనా రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పుల్కల్ మండల మాజీ బీఆర్ఎస్ అధ్యక్షుడు మాచర్ల విజయకుమార్, కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రావణ్ కుమార్, సింగూర్ మాజీ సర్పంచ్ రాజు గౌడ్, రాయిపహాడ్ సర్పంచ్ రాజు, మాణిక్యం క్రాంతి సేన, ఎర్రోళ్ల పోచయ్య, బస్వాపూర్ మాజీ సర్పంచ్ విష్ణుయ్య, యువజన సంఘం అధ్యక్షుడు ఇందూరి మోహన్, కోడూరు సర్పంచ్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



## మెదక్ జిల్లాలో 6,347 మెట్రిక్ టన్నుల జొన్నల కొనుగోలు.. మరో రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తి

సందేశం టైమ్స్ మెదక్, జూలై 03 (జిల్లా ఇన్‌చార్జి అనిల్ కుమార్): మెదక్ జిల్లాలో రైతుల నుంచి ఇప్పటివరకు 6,347 మెట్రిక్ టన్నుల జొన్నలను కొనుగోలు చేసినట్లు అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ఆరు కొనుగోలు కేంద్రాల ద్వారా 3,609 మంది రైతుల నుంచి జొన్నలను సేకరించినట్లు వెల్లడించారు. రైతులకు క్వింటాల్‌కు రూ.3,699 మద్దతు ధర చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. మట్టిపెళ్లలు, ఇతర మలినాలు లేకుండా జొన్నలను శుభ్రపరచి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా కొనసాగిస్తున్నామని, మరో రెండు రోజుల్లో జిల్లాలో జొన్నల కొనుగోలు పూర్తయ్యే అవకాశముందని తెలిపారు. రైతులు ఎలాంటి అపోహలకు గురికాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.



## భారీ వర్షాలతో ముంబయి అతలాకుతలం.. ఉత్తరాది రాష్ట్రాల్లో జనజీవనం అస్తవ్యస్తం

సందేశం టైమ్స్ ముంబయి/ఢిల్లీ, జూలై 03 (ప్రతినిధి): దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో వరుసగా రెండో రోజు కురిసిన భారీ వర్షాలు నగరాన్ని అతలాకుతలం చేశాయి. గత 24 గంటల్లో పలు ప్రాంతాల్లో 100 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదవడంతో రహదారులు జలమయమై ట్రాఫిక్ తీవ్రంగా స్తంభించింది. వర్షాల ప్రభావంతో మూడు విమానాలను ప్రత్యామ్నాయ విమానాశ్రయాలకు మళ్లించగా, పాల్ఘర్ జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసి విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. థాణె, పాల్ఘర్, ముంబయి మెట్రోపాలిటన్ ప్రాంతాల్లో విస్తారంగా కురిసిన వర్షాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మహారాష్ట్రతో పాటు దక్షిణ బెంగాల్‌లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో వర్షాలకు సంబంధించిన వేర్వేరు ఘటనల్లో ఏడుగురు మృతి చెందగా, ఉత్తర్ ప్రదేశ్‌లో పిడుగుపాటుకు మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో వర్షాలతో ఎండల తీవ్రత తగ్గి ప్రజలకు ఉపశమనం లభించింది. ఉత్తరాఖండ్‌లో నైరుతి రుతుపవనాలు చురుగ్గా విస్తరించడంతో డెహ్రాడూన్ సహా పలు ప్రాంతాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా, హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ జిల్లాలో భారీ వర్షాల కారణంగా శిమ్లా, మనాలీ, ధర్మశాల ప్రాంతాలకు వెళ్లే పలు రహదారులు మూసివేశారు. భారీ వర్షాలతో తీవ్రంగా ప్రభావితమైన అరుణాచల్ ప్రదేశ్‌కు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

## బోరంచ శ్రీ నల్ల పోచమ్మ దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో విశేష పూజలు




సందేశం టైమ్స్ మనూర్, జూలై 03 (ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా మనూర్ మండలం బోరంచ గ్రామంలో వెలసిన శ్రీ నల్ల పోచమ్మ దేవస్థానంలో గురువారం ప్రాతఃకాల విశేష పూజలు, ప్రత్యేక అలంకరణ, మహా మంగళహారతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ స్వామి ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి కుటుంబ సౌఖ్యం, ఆయురారోగ్యం, సుభిక్షం కలగాలని ప్రార్థించారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడగా, భక్తులు "ఓం శ్రీమాత్రే నమః" నినాదాలతో అమ్మవారిని భక్తి భావంతో స్మరించారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్





సందేశం టైమ్స్ తిరుమల, జూలై 03 (ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గురువారం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రైల్వే కోడూరు నియోజకవర్గంలో విబీజీ-రాంజీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం నేరుగా తిరుమలకు చేరుకున్న ఆయన, దీక్షలో భాగంగా శ్రీవారి సేవలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలోని శ్రీ రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందజేసి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందించారు. అధికారిక కార్యక్రమాలు ముగిసిన తర్వాత శ్రీవారిని దర్శించుకోవాలన్న సంకల్పంతో సాయంత్రం దర్శనానికి వచ్చినట్లు సమాచారం. ఈ సందర్భంగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శివశ్రీనివాస్, హస్తకళల నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ తదితరులు పవన్ కళ్యాణ్‌తో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు.



# గ్రామీణాభివృద్ధికి కొత్త ఊపు: ముక్కావారిపల్లెలో 'వీబీజీ-రాంజీ' పథకం ఘనంగా ప్రారంభం

రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ముక్కావారిపల్లెలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో "వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ (వీబీజీ-రాంజీ)" పథకం లాంఛనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర సహాయ మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేష్ పాశ్వాన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం అపూర్వమని పేర్కొన్నారు. నిధుల కేటాయింపుల్లో రాష్ట్రానికి దేశంలో మూడో స్థానం లభించడం గర్వకారణమని ఆయన అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 24వ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను ప్రస్తుతం ముందంజలోకి తీసుకువచ్చామని, గ్రామీణ ఉపాధి భరోసా మరింత బలపడేలా పని దినాలను 125 రోజులకు పెంచినట్లు తెలిపారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అభ్యర్థనను వెంటనే అంగీకరించి ఆంధ్రప్రదేశ్‌లో ఈ పథకాన్ని ప్రారంభించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తు భారతదేశం కేవలం నగరాభివృద్ధిపైనే కాకుండా సమ్మిళిత గ్రామీణాభివృద్ధిపైనే ఆధారపడి ఉందని, గ్రామాలను శక్తివంతం చేసే దిశగా ఈ పథకం కీలక పాత్ర పోషిస్తుందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

# ప్రపంచ అత్యుత్తమ క్వాంటం కేంద్రాల్లో అమరావతికి స్థానం – మరో రెండేళ్లలో 'అమరావతి మేడ్' క్వాంటం కంప్యూటర్

అమరావతి, జూలై 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఈ ఏడాది డిసెంబర్ నాటికి అమరావతిలో క్వాంటం కంప్యూటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనితో ప్రపంచంలోని అత్యుత్తమ ఆరు క్వాంటం కంప్యూటింగ్ కేంద్రాల్లో అమరావతి ఒకటిగా నిలవనుందని వెల్లడించింది. కేవలం క్వాంటం కంప్యూటర్‌ను ఏర్పాటు చేయడమే కాకుండా, క్వాంటం కంప్యూటర్ల తయారీ కేంద్రంగా కూడా అమరావతిని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ దిశగా అవసరమైన మౌలిక వసతులు, పరిశోధనా కేంద్రాలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపింది. మరో రెండేళ్లలో పూర్తిగా అమరావతిలోనే తయారయ్యే 'అమరావతి మేడ్' క్వాంటం కంప్యూటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు పేర్కొంది. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో అత్యాధునిక సాంకేతిక రంగానికి ఊతమివ్వడంతో పాటు పెట్టుబడులు, పరిశోధనలు, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం, మంత్రివర్గ కీలక నిర్ణయాలు – వీబీజీ-రామ్‌జీపై సుప్రీంకోర్టును ఆశ్రయించనున్న రాష్ట్ర ప్రభుత్వం



హైదరాబాద్, జూలై 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు సుమారు 1.50 లక్షల మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, బోధనేతర సిబ్బందికి కూడా అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యా సంస్థల్లో అందరికీ సమానమైన భోజన సౌకర్యం కల్పించడం ద్వారా విద్యా వాతావరణాన్ని మరింత మెరుగుపర్చడమే లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. ఇదే సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వీబీజీ-రామ్‌జీ పథకంపై రాష్ట్రాలు వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా అమలు చేస్తున్న నేపథ్యంలో ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని మంత్రివర్గం నిర్ణయించింది. గతంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం సమర్పించిన నివేదికపై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియాకు తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో తీసుకొచ్చిన వీబీజీ-రామ్‌జీ పథకం నిరుపేద కూలీల హక్కులను హరిస్తోందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నప్పటికీ, ఉపాధి హామీ కూలీలకు నష్టం కలగకుండా ఉండేందుకు అనివార్య పరిస్థితుల్లో రాష్ట్రంలోనూ అమలు చేయాల్సి వస్తోందని వారు పేర్కొన్నారు. అలాగే కొత్తగా ప్రారంభమవుతున్న సనత్‌నగర్, ఎల్‌బీనగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రులతో పాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్య సేవలను బలోపేతం చేసేందుకు వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది నియామకానికి మొత్తం 6,278 పోస్టులను మంజూరు చేస్తూ, ఈ ఆసుపత్రులను నిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇక్కడ అందించే వైద్య సేవలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఎల్‌ఓసీలు జారీ చేయాలని కూడా ఆమోదం తెలిపింది. మరోవైపు హైదరాబాద్ మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు తొలి దశలో గాంధీ సరోవర్ వరకు 21 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ రూ.7,345 కోట్ల వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ ప్రక్రియను త్వరలోనే ప్రారంభించనున్నట్లు మంత్రులు వెల్లడించారు.







# దేశ ఆర్థికాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలపడం లక్ష్యం: నారా లోకేష్

శ్రీసిటీ, జూలై 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీని విద్య, సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలపాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రపంచ స్థాయి విద్యా సంస్థలను రాష్ట్రానికి తీసుకురావడం ద్వారా యువతకు నాణ్యమైన విద్యతో పాటు అంతర్జాతీయ స్థాయి ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. విద్య, పరిశ్రమలు, సాంకేతిక రంగాల సమన్వయంతో నైపుణ్యవంతులైన మానవ వనరులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ రాష్ట్ర ఉన్నత విద్యా రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఈ విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విశ్వవిద్యాలయ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పత్రిక పేరు: సందేశం టైమ్స్ (Sandesham Times)- రిజిస్ట్రేషన్ నం: TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, (పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ- 508206, ప్రచురణకర్త /publisher: కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: నండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్- 522006.